అంతరించిన ఆనందం

'శార్వాణి'

మిత్ర శ్రీ రామారావుకి నమస్సులు ...

నిమిష నిమిషానికి, గంట గంటకు, రోజు రోజుకు నాలో విచిత్రపరిణామం ప్రబలుతోంది. ఆ పరిణామం మంచి చెడులను నిర్ణయించలేకపోతుంది. జీవితంలో మహత్తరమైన వస్తువును కోల్పోయి, నిరాశతో నలిగిపోతున్న మనస్సు, మమతకు దూరం అయిపోయింది. అందరికీ అతి తేలిగ్గా అర్థమయ్యే బాధ మాత్రం, హృదయంమీద కూర్చుని, చీకటి వేపుకి నడిపిస్తుంది. ఆ బాధ కన్నీరుగామారితే, ఎవరికీ కన్పించకుండా, చివరకు అందర్లూ ఏమవుతారో ఆ మట్టిలో కలసిపోతుంది. చీకటి గోడల మధ్య ఎన్ని రోజులు యిలా కూర్చోవాలి? ఆశలు పెంచుకుంటున్న జీవితం, ఒక్కొక్క మెట్టునుంచి జారిపడుతుంటే, నిశలో నవ్వుతున్న నిరాశ నిలచి చూస్తుంది.

నిన్న రాత్రి నడుస్తున్నాను — నా నీడను తొక్కుకుంటూ నడుస్తున్నాను. చీకటిలో వెలుతురువల్ల యేర్పడిన నీడ, నన్ను చూచి జాలిపడటంలేదు. సానుభూతి చూపడంలేదు. ఎందుకని? ఆ నీడకు ఆధారం నేనే! నేను లేకపోతే ఆ నీడ రాదు.

ఆ నీడలో మసగ మసగగా ... కన్పిస్తోంది, చిన్నప్పుడు, అప్పటికింకా నీతో నాకు పరిచయం లేదు. అప్పుడు నేను మా మామయ్యగారింట్లో వుండేవాడ్ని. బాధలంటే తెలియని రోజులు. తెల్లవారుఝామున మామయ్యలేపి, చాకలివాడింటికి పంపినపుడు, చలిలో వెళ్తున్నా, బాధంటే తెలిసేదికాదు. ఇప్పుడు చలేస్తే ... అమ్మ బాబోయి, ఇంకేమైనా వుందా? వణికిపోతాం, కప్పుకోడానికి శాలువా లేకపోతే దుప్పటి వుండాలి. అప్పుడు ఎంతకష్టమైన పనిచేసినా, బాధనిపించేదికాదు. బాధ ఫలానా విధంగా వుంటుందని తెలియదు కాబట్టి, నిజంగా కష్టపడుతున్నా, బాధపడుతున్నట్లు ఫీలవ్వను. ఆ రోజులు యించక్కగా వుండేవి. ప్రాణం హాయిగా వుండేది, మనస్సు స్థిమితంగా వుండేది. చదువు చక్కగా సాగేది. ఏపని తలపెట్టినా విజయవంతంగా, బాధలేకుండా జరిగిపోయేది. బాధ, విచారం, దుఃఖం, నిరాశలేని పరిస్థితులలో, ప్రేమించడం నేర్పింది మంచి భావం ... ఆ ఇంట్లోనే ఒక అమ్మాయి ఉండేది ... అది అప్పుడు చాల చిన్న పిల్ల. పరికిణి, జాకెట్టు వేసేది. అది కట్టుకునే దుస్తులు చాల ఖరీదైనవి. మరి నేనో, చాల తక్కువ ధరలో బట్టలు కుట్టించుకునేవాడ్ని. అది ఖరీదైన బట్టలు కడుతుందని నాకు అసూయలేదు. నేను ముతక చొక్కాలు వేస్తున్నందుకు దానికి బాధలేదు. పేద పెన్నిధుల తారతమ్యతకు మా స్నేహంలో చోటు వుండేదికాదు. మంచి భావంతో యిద్దరూ పెరుగుతున్నాం. ఆ ఇంట్లోనేకాదు, బయటచుట్టాలుకూడా, "వెంకటేశ్వర్రావు మంచివాడని, చాల బుద్ధిమంతుడని" అభినందించేవారు. ఏ అమ్మాయి నా హృదయంలో స్థిరరూపాన్ని చిత్రింపచేసుకుంటుందో ఆ అమ్మాయి, నేను మంచివాడ్నని గుర్తించింది. అందుకు సంబరపడ్డాను. మహోజ్వలమైన భవిష్యత్తు వుంటుందని వువ్విళ్లూరి, వూగిపోయాను. తియ్యని కలలు కన్నాను. ఒక రోజు దీపావళినాడు, అది తలంటుకొని, కొత్త బట్టలు వేసుకొని నా దగ్గరకు వచ్చింది. పూసరేకులు, సున్నుండలు బలవంతంగా తినిపించింది. తినకపోతే పీసిచిట్లుకొట్టేది. అప్పుడుకూడా బాధంటే తెలిసేదికాదు. అమాహ్యామైన ఆనందం, అవ్యాజమైన అనురాగం అవతరించేవి. అడుగడుగునా ఆనందం అందేది. కాలం మమ్మల్ని పెద్దవాళ్లని చేసింది. లోకం మమ్ములను వేరుచేసింది. విడిపోయాయి హృదయాలు; విచ్ఛిన్నమైపోయాయి జీవితాలు. దానికి పెళ్ళయిపోయింది. అది నన్ను పూర్తిగా మరచిపోయింది. దానికి కావలసినంత డబ్బు, పెట్టుకోలేనన్ని నగలు, షికార్లు తిరగటానికి కారులు, అవేమి నా దగ్గరలేవు, అది నా మనస్సును ప్రేమించింది. మరొకడి ధనాన్ని పెళ్ళిచేసుకుంది, సుఖం ధనానికిస్తుంది, మంచిని మనస్సుకు అందివ్వడానికి ప్రయత్నంచేస్తుందట. అది మరొకడ్ని

వివాహంచేసుకుందని, పిచ్చివాణ్ణయిపోలేదు. లైలా కోసం కైస్‌లాగ, అనార్కలీకోసం సలీమ్‌లాగ చావలేదు. కైస్‌మీద, సలీమ్‌మీద జాలిపడలేదు. వాళ్లు అనవసరంగా, ప్రేమకోసం బలయ్యారు. ప్రేమకోసం బలిఅవ్వడమంత తెలివితక్కువతనం మరొకటి వుండదు. బాధపడుతూ ప్రేమలోవున్న నిజాన్ని తెలుసుకోవడం చేతకాక, ఎడారిలో పెనుతుఫానులో ఒకడు, సమాధికి నెత్తికొట్టుకొని మరొకడు దారుణంగా చచ్చారు—పిచ్చివాళ్ళు.

నిబ్బరంగా వున్నాను. పీడవదిలిందని వూరుకున్నాను. పెళ్లిచేసుకోవాలని సంబరపడ్డాను. నా పెళ్లిగురించి, మావాళ్ళెవరికీ శ్రద్ధలేదు....ఒక్క మా అమ్మకు తప్ప ... తన తనువుండగా నా మనువు చూడాలని ఆమె తాపత్రయం. ఎన్నో సంబంధాలు చూచింది. ఒకటీ తనకు నచ్చలేదు. ఆమెకెందుకు నచ్చలేదోనాకు తెలుసు. చెప్పుకుంటే సిగ్గు అయినా చెప్పాలి. కట్నం తక్కువని నచ్చలేదు. ఎవడో తలమాసిన వెధవ కట్నం గుంజుకొని, ఏదో పెద్ద పాడి చేస్తున్నాడని, లోకం కట్నంతీసుకొనక పోతేహర్షించదని, నన్ను రెండువేల ఐదువందలకు పెళ్ళి మార్కెట్టులో అమ్మివేశారు. అందుచే నా పరిస్థితియిలా పరిణమించింది. సంబంధంకుదుర్చుకొనేముందు నిన్నుతీసుకొనివెళ్ళినందు కిప్పుడు బాధపడుతున్నాను. పెళ్లి కొడుకుగా ఆ అమ్మాయిని ఏవిధముగా చూడగల్గానో, అదేవిధముగా నీవు చూచేవేగాని నాభవిష్యత్ జీవితాన్ని ఆలోచించలేకపోయావు.

“అమ్మాయి ఎట్లావుంది” అని అడిగారు,

“అమ్మాయికే! బ్రహ్మాండంగా వుంది” అని చెప్పావు. నీవుకూడా మా వాళ్లు తొందర పడినట్లు తొందర పడ్డావు. అన్నిటికంటె ఇది మరీ విచిత్రం—పెళ్ళి ముందు మా అన్నయ్యను సంబంధం చూడ్డానికి పంపించాను. అప్పుడతనికి మనస్ఫూర్తిగా నచ్చలేదు. అందరికి నచ్చిందని అన్నారు కాబట్టి, తనకూ నచ్చిందని మనసులో విషయాన్ని దాచాడు.

వీళ్లందరూ మనుష్యులు. నా జీవితానికి సుఖాన్ని అందించే ఆపద్బాంధవులు

రామారావూ! అంతా అయిపోయింది. ఊహించిన విషయంలో వెయ్యోవంతుకూడా జరగలేదు. గీతాన్ని జ్ఞాపకం చేసుకొని బాధ పడటం మరచి పోవాలని ప్రయత్నంచేస్తున్నా, ప్రయోజనం లేకపోతుంది. నా వివాహం అయిన 120 రోజుల్లో, “సుఖపడ్డాను” అన్న రోజు వెతుక్కుంటే దొరకదు. సుఖంలేదు. ఆనందంరాదు. ఇహాపోతే డబ్బిచ్చి సుఖాన్ని కొనుక్కోవాలి. మనసిచ్చి సుఖాన్ని పొందే తరుణం జారిపోయింది. ధనంతో ఆనందానికి వెల కట్టి, సంతోషపడటం నేర్చుకోవాలి.

ఒహందుకు విచారిస్తున్నాను. అది చిన్నపిల్ల. పాపం? బాధంటే దానికింకా తెలియదు. దానికి పెళ్ళయినా పసిపిల్లే! ఏంచేయను? దానికోసం విచారిస్తున్నా, ఆ విచారం కసిగా, బాధగా మారిపోతుంటే ఏంచేయమంటావు? అవును నాకు సుఖం కావాలి...కష్టపడుతున్నాను. మెదడును పాడుచేసుకుంటున్నా. రెక్కలు ముక్కలయ్యేటట్లు, వళ్లు గుల్లఅయ్యేటట్లు శ్రమపడుతున్నాను. అటువంటప్పుడు సుఖం అవసరంలేదా? నేను ఆనందాన్ని కోరుకోటానికి అర్హుణ్ణికానా? చెప్పు! నిజం చెప్పు!! కష్టపడి శ్రమపడి ఇంటికి చేరుకుంటే ఇల్లు ఒక నరకంలాగ, ఇల్లాలు ఒక నల్లిలాగ కన్పిస్తుంది. అది నన్ను సుఖపెట్టలేక పోతుంది. నేను నలిగిపోతున్నాను. సంతోషానికి దూరమయిపోతున్నాను. “అదిమాత్రం ఏచేస్తుంది?” అని అనుకుంటున్నానేగాని, దానిమీద జాలిరావడంలేదు. ఇష్టం కల్గటంలేదు. నాలో రాక్షసత్వం ఆవహించి నన్ను మానవత్వంనుంచి దిగజారుస్తోంది. ఇంతకముందు మంచివాడన్న లోకం నన్ను చెడ్డవాడని కొత్తనామకరణ చేస్తుంది. నాకెందుకో నవ్వొవస్తుంది. నామీద నాకే జాలివేస్తుంది. నన్ను నేనే అసహ్యించుకోవలసి వస్తుంది.

నిర్మించుకున్న నిర్ణీత సమధులు చెరిగిపోయాయి. మంచి భావం విరిగిపోయింది. ఈ విధముగా ఎందుకయి పోతున్నానో? నాలో నేను ప్రశ్న వేసుకుంటే భయమేస్తుంది. నేను ప్రశ్న వేసుకుంటే భయమేస్తుంది. ఎంతోకాలం బ్రతకనేమో అన్పిస్తుంది. జీవితం మీద చిరాకు విసుగు వైరాగ్యం ఒక్కసారి గల్గుతాయి. మళ్లా వెంటనే సుఖం కోరుకోవాలని దానికోసం బ్రతకాలనిపిస్తుంది. జీవితంకు "బ్రతకాలి చావాలి" మధ్య సంఘర్షణ పెద్దముడి విడకుండావుంది ఘర్షణ లోపల జరుగుతున్నంతకాలం మనిషినలిగి. పోతాడు. చివరకు ఎందుకూ కాక కాకుండా పోతాను.

రామం! అది మొన్నె ఉత్తరం వ్రాసింది. చూశావా! నన్ను బాధ పడవద్దంటుంది. నన్ను సంతోషపరచటానికి తన సాయశక్తులా ప్రయత్నం చేస్తుందట. నాకోసం ఎంతేనా ప్రయత్నం చేస్తుందట? నన్ను సంతృప్తిపరచడానికెంత ఆలోచిస్తుందో? దాని ప్రయత్నంవల్ల మళ్లా మనిషికాలేను. దాని ఆలోచన ఆనాందాన్ని అందివ్వలేదు. ఒక వేళ జరిగినా, అవి ఎడారిలో ఎండ మావులు...చీకటిలో మిణుగురు పురుగులు.

రామం! వెళ్తున్నా! ఎక్కడకని ప్రశ్న వేయకు! వేస్తే లోకం బాధపడుతుంది. నన్ను అసహ్యించుకుంటుంది. అచ్చటే అవినీకి, అసహ్యం, అసభ్యత వుంటాయి. కావలసినంత సుఖం దొరుకుతుంది. ఆ సుఖం కోసం పరిగెత్తుతున్నా...పడుతున్నా మోకాళ్లు పగులుతున్నాయి...అయినా ఫర్వాలేదు సుఖం లభ్యమవుతుంది. సుఖపడుతుంటే మీరంతా తిడతారెందుకు? నేను సుఖ పడటం మీకిష్టంలేదా? మీ ఇష్టాలతో నాకనవసరం...నేను సుఖపడాలి... అదే కావాలి...ఆ మార్గాన్నే నడుస్తున్నాను.

ప్రేమించిన దానికి యిద్దరు ఆడపిల్లలు. పెళ్ళిచేసుకుంటానన్న దానికింకా పెళ్ళికాలేదు. ఇప్పట్లో అవ్వదు. ఒక వేళ అయినా నాలాగ బాధపడుతుంది.

ఆయనను మించినవాడే!

ఆ వూళ్లో ఒక పెద్దమనిషి వున్నాడు. చెప్పరానంత బద్ధకస్తుడు. తన దగ్గర పని చేయటానికి ఒక అబ్బాయిని కుదుర్చుకున్నాడు. ఆ అబ్బాయి బద్ధకంలో యజమానికన్నా రెండాకులు ఎక్కువగా చదివినవాడే! ...

యజమాని ఒక రోజున ఏదో తొందర పనిమీద ప్రక్క వూరికి వెళ్లాలసి వచ్చింది. నౌకరిని తను వేసుకునే పాదరక్షలని సిద్ధం చేసి వుంచమని ఆజ్ఞాపించి, ఆయన తన ముస్తాబు ఆయాక చెప్పుల్ని వేసుకోబోయాడు. వాటిలో ఒకటి పెద్దది. మరొకటి చిన్నది. "ఇలా చేస్తూవుంటే పని పాటలు ఎలా నేర్చుకో గలుగుతావు?" అంటూ ఆ పని అబ్బాయిమీద పడ్డాడు. కొంపమునిగి పోయిందని ఆ అబ్బాయి తెలుసుకుని "చిత్తం, చిత్తం. అయిందేమో అయింది. దానికోసం తమరు కోపపడటం ఎందుకు? ఇలాటి జతనే సామాన్లగదిలో చూశాను. వాటిని తెచ్చిపెడతాను. ఈ చిక్కును అప్పుడు మీరే చక్కచేసుకుంటారు. మా వూళ్లో పాదరక్షలు వుంటేగా, ఇలాటి చిక్కులని తేల్చటానికి మాకు వీలుంటుంది" అంటూ అమాయకంగా అనేసి, తిన్నగా ఆ జతను తీసుకుని రావడానికి ప్రక్కగదిలోకి నడిచాడు.